సూర్య 18వ వసంతంలోకి.. www.suryaa.com

EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com

4PM www.suryaa.com శుక్రవారం 21-02-2025 పేజీలు: 02

# బాపు సినిమా రివ్యూ

ఈ మధ్య కాలంలో పల్లెటూరు నేపథ్యం ఉన్న కథలకు బాగా డిమాండ్ పెరిగిపోయింది. ఈ క్రమంలోనే తాజాగా వచ్చిన సినిమా బాపు. సీనియర్ నటుడు బ్రహ్మాజీ కీలక పాత్రలో కొత్త దర్శకుడు దయ తెరకెక్కించిన సినిమా బాపు. మరి ఈ సినిమా ఎలా ఉందో పూర్తి రివ్యూలో చూద్దామా. తెలంగాణలో ఒక పల్లెటూరు.. అందులో చంటి (రచ్చ రవి) జెసిబి డ్రైవర్. ఊర్లో బావులన్నీ పూడికలు తీస్తూ ఉంటాడు. అలా తీస్తున్నప్పుడు ఒకరోజు బంగారు విగ్రహం బయటపడుతుంది. దాన్ని తీసుకెళ్లి జాగ్రత్తగా ఇంట్లో దాచిపెట్టి అమ్మ లక్ష్మమ్మ (గంగవ్వ)కు జాగ్రత్త అని చెప్పి వెళ్తాడు. చంటి వచ్చేసరికి లచ్చమ్మ దాన్ని బావిలో పడేస్తుంది. కట్ చేస్తే అదే ఊళ్లో ఎకరం పొలం ఉన్న రైతు మల్లన్న (బ్రహ్మాజీ). ఆయనకు భార్య సరోజ (ఆమని), ఆటో నడుపుకునే కొడుకు రాజు(మణి), డిగ్రీ చదివే కూతురు వరలక్ష్మి(ధన్య), ఇంటిదగ్గర ఖాళీగా ఉండి చుట్టలు కాల్చే నాన్న రాజయ్య (సుధాకర్ రెడ్డి) ఉంటారు. వ్యవసాయం కోసం ఊర్లో అందిన ప్రతిచోట అప్పు చేస్తాడు మల్లన్న. కానీ చేతిదాకా వచ్చిన పత్తి పంట వాన పాలవుతుంది. దాంతో కష్టాలు మళ్ళీ మొదటికి రావడంతో తాను ఆత్మహత్య చేసుకుంటే రైతు భీమా ఐదు లక్షలు కుటుంబానికి వస్తాయని ఆలోచిస్తాడు. కానీ ఒకరు చూసి ఆ చావును అడ్డుకుంటారు. ఆ తర్వాత కుటుంబమంతా కలిసి ఒక అనూహ్యమైన నిర్ణయం తీసుకుంటుంది. ఆ నిర్ణయం వల్ల మల్లన్న తండ్రి రాజయ్య చిక్కుల్లో పడతాడు. అంతటి అనూహ్యమైన నిర్ణయం ఏంటి.. అలాంటి కష్టాల నుంచి ఆ కుటుంబం ఎలా బయటపడింది..? ఆ బంగారు విగ్రహం ఏమైంది అనేది మిగిలిన కథ. బలగం సినిమా తర్వాత పల్లెటూరి నేపథ్యంలో ఉన్న కథలకు డిమాండ్ బాగా పెరిగింది. ఇంకా చెప్పాలంటే అలాంటి కథలనే ఎక్కువగా నిర్మాతలు కూడా ఆశిస్తున్నారు.. చుట్టూ న్యాచురల్ ఆర్టిస్టులతో సినిమాలు చేస్తే ఈజీగా ఆడియన్స్‌కు కనెక్ట్ అవుతాయని నమ్ముతున్నారు నిర్మాతలు. బాపు సినిమాలో కూడా ఇదే చేశారు. బ్రహ్మాజీ, ఆమని, ధన్య, అవసరాల శ్రీనివాస్ లాంటి కొందరు నటులు మినహాయిస్తే.. మిగిలిన వాళ్ళంతా కొత్తవాళ్లే. పూర్తిగా ఊరు నేపథ్యంలోనే సాగే కథ ఇది. కథలోకి వెళ్లడానికి ఎక్కువగా టైమ్ తీసుకోలేదు దర్శకుడు దయా. తాను అనుకున్న పాయింట్ మొదటి 10 నిమిషాల్లోనే చెప్పాడు. ఆ తర్వాత అసలు కథలోకి వెళ్లాడు. బావిలో పూడికలు తీయడం.. విగ్రహం దొరకడం.. గంగవ్వ నీళ్ళపాలు చేయడం.. ఇవన్నీ ఫాస్టుగానే అయిపోతాయి. ఆ తర్వాత అసలు కథ మొదలవుతుంది. బ్రహ్మాజీ రైతు ఎపిసోడ్ మొదలైన తర్వాత ఊహించినంత వేగంగా కథనం ముందుకు సాగలేదు. కథ అంతా అక్కడక్కడే తిరుగుతున్నట్లు అనిపిస్తుంది. రైతు కష్టాలను న్యాచురల్‌గా చూపించారు కానీ ఎమోషన్స్ పరంగా మాత్రం బాగా మిస్ ఫైర్ అయింది బాపు. బలగం సినిమాలో కథ తక్కువున్నా.. ఎమోషనల్‌గా చాలా బలంగా ఉంటుంది సినిమా. కానీ బాపు సినిమాలో ప్రధానంగా మిస్ అయింది అదే. కథలో తాను చెప్పాలనుకున్న పాయింట్ వదిలేసి.. ఇంకొక క్రైమ్ పాయింట్ మీద కథ చాలా సేపు నడిపాడు దర్శకుడు. దానివల్ల ఫీల్ అనేది రాదు. అంతేకాదు.. బ్రహ్మాజీ కొడుకు రాజు లవ్ ట్రాక్ కూడా అంతగా ఆసక్తికరంగా అనిపించదు. ఏదో కావాలని ఇరికించినట్లు అనిపిస్తుంది. ముగింపు కూడా ముందుగానే ఊహించొచ్చు. మరోవైపు ధన్య బాలకృష్ణన్, అవసరాల శ్రీనివాస్ ట్రాక్ సైతం పెద్దగా ఇంట్రెస్టింగ్‌గా లేదు. చివరి 20 నిమిషాల్లో ఎక్కువగా ఎమోషనల్ వైపు అడుగులేసాడు దర్శకుడు దయ. బ్రహ్మాజీ నటన గురించి ఏం చెప్పాలి..? ఇప్పటి వరకు చేయని ఓ పాత్రలో మెప్పించాడు ఈ సీనియర్ నటుడు. ఆమని కూడా తన పాత్ర పరిధి మేరకు బాగా నటించింది. మరో కీలకమైన పాత్రలో మేం ఫేమస్ ఫేమ్ మణి అలరించాడు. ఇక ధన్య బాలకృష్ణన్ తన వరకు బాగా నటించింది. అవసరాల శ్రీనివాస్ అతిథి పాత్రలో అవసరం మేరకు అక్కడక్కడా కనిపించాడు. బాపు టైటిల్ రోల్ చేసిన సుధాకర్ రెడ్డి చాలా బాగున్నాడు. బలగం సినిమాలో కాసేపు కనిపించి అలరించిన ఈ పెద్దాయన.. బాపులో మాత్రం సినిమా అంతా ఉన్నాడు. ఒక కీలకమైన పాత్రలో రచ్చ రవి కూడా చాలా బాగా నటించాడు. బాపు సినిమాకు మెయిన్ హైలైట్ ఆర్ఆర్ ధ్రువన్ సంగీతం. ఆయన అందించిన పాటలే కాదు.. ఆర్ఆర్ కూడా అదిరిపోయింది. వాసు పెండం సినిమాటోగ్రఫీ వర్క్ చాలా బాగుంది. ఊరి అందాలు బాగా చూపించాడు. సినిమా నిడివి కేవలం రెండు గంటలే అయినా కూడా ఎందుకో బాగా లెంతీగా అనిపించింది. ఫస్టాఫ్‌లో హీరో హీరోయిన్ లవ్ ట్రాక్‌లో కొన్ని సీన్స్‌తో పాటు పాట కూడా కట్ చేసే ఛాన్స్ ఉన్నా రిస్క్ తీసుకోలేదు ఎడిటర్. దర్శకుడి ఛాయిస్ కాబట్టి అతని తప్పు పట్టలేము. దర్శకుడు దయ తనకు వచ్చిన అవకాశం అంతగా వాడుకోలేదనే చెప్పాలి. కథ రాసుకున్నాడు కానీ ఎమోషన్స్ పట్టుకోవడంలో విఫలమయ్యాడు. నిర్మాణ విలువలు కథకు తగ్గట్లుగా ఉన్నాయి.




## గవర్నర్‌ని కలిసిన వైసీపీ నాయకులు

వైసీపీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి భద్రత కల్పించడంలో పోలీసులు విఫలమయ్యారని గురువారం రాజ్ భవన్ కు వెళ్లి గవర్నర్ అబ్దుల్ నజీర్ ను వైసీపీ నాయకులు కలసి వినతిపత్రాన్ని సమర్పించారు. మాజీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ కు జడ్ ప్లస్ సెక్యూరిటీ ఉంటుందని, అయితే ఆయనకు ఎక్కడకు వెళ్లినా భద్రత కల్పించాల్సిన బాధ్యత పోలీసులదేనని తెలిపారు. జగన్ భద్రతపై తమకు ఆందోళనగా ఉందని, రక్షణ కల్పించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని వైసీపీ నేతలు గవర్నర్ ను కోరారు. జగన్ పర్యటనలో అనేక భద్రతా వైఫల్యాలు కనిపించాయని వారు తెలిపారు. శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్, మాజీ మంత్రులు అంబటి, మేరుగ, వెల్లంపల్లి, కారుమూరు, ఎమ్మెల్సీలు అప్పిరెడ్డి, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.





## మిర్చి రైతులను ఆదుకుంటాం సీఎం చంద్రబాబు

గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది మిర్చి ధరలు అనూహ్యంగా పడిపోయాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కలిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ఏడాది విదేశాల్లో డిమాండ్ తగ్గడం వల్ల మిర్చి రైతులు చాలా నష్టపోయే పరిస్థితి వచ్చిందన్నారు. మిర్చి రైతులను ఆదుకోవాలి, వారికి మేలు చేయాల్సిన అవసరం ఉందని సీఎం పేర్కొన్నారు. ధరల స్థిరీకరణ కోసం ఏం చేయాలో ఆలోచిస్తామని తెలిపారు.మిర్చి రైతులను ఆదుకోవాలి, వారికి మేలు చేయాల్సిన అవసరం ఉంది. అది కూడా ఐసీఏఆర్ గైడ్‌లైన్స్ ప్రకారం ఏపీలోని కాస్ట్ ఆఫ్ కల్టివేషన్ తీసుకోకుండా.. ధర నిర్ణయించే పరిస్థితికొచ్చారు.

## ప్రభుత్వ వైద్యులను తొలగించిన సర్కార్

ఏపీలోని కూటమి సర్కారు మరో కీలక నిర్ణయం తీసుకుంది. దాపు 55 మంది వైద్యులను తొలగిస్తున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా వీరంతా ఎలాంటి అనుమతులు, సెలవు లేకుండా ఏడాదికి పైగా వైద్యులు విధులకు గైర్హాజరవుతున్నట్లు భారీగా లోకాయుక్త కు ఫిర్యాదులు అందాయి. దీనిపై విచారణ జరిపిన లోకాయుక్త వైద్యుల గైర్హాజరు నిజమేనని తేల్చింది. ఈ మేరకు ప్రజలకు అండాల్సిన వైద్య సేవలపై నిర్లక్ష్యం వహించినందుకు వీరందరినీ విధుల్లో నుంచి తక్షణమే తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వానికి కీలక ఆదేశాలు జారీ చేసింది. లోకాయుక్త ఆదేశాల మేరకు 55 మంది వైద్యులను తక్షణమే విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# రామం రాఘవం రివ్యూ



జబర్దస్త్ కమెడియన్లు నవ్వించడమే కాదు దర్శకులుగా కూడా మెప్పించగలరని బలగం మూవీతో వేణు నిరూపించాడు. వేణు బాటలోనే రామం రాఘవం మూవీతో మరో కమెడియన్ ధన్‌రాజ్ అడుగులు వేశాడు. తానే ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తూ ఇందులో ఓ కీలక పాత్ర పోషించాడు. సముద్రఖని మరో ముఖ్య పాత్రలో నటించిన ఈ మూవీ శుక్రవారం (నేడు) థియేటర్లలో రిలీజైంది. తండ్రీకొడుకుల బంధంతో తెరకెక్కిన ఈ మూవీతో దర్శకుడిగా ధన్‌రాజ్ ప్రేక్షకులను మెప్పించాడా? లేదా? అంటే...దశరథ రామం (సముద్రఖని) నిజాయితీపరుడైన ప్రభుత్వ ఉద్యోగి. కొడుకు రాఘవ (ధన్‌రాజ్) అంటే దశరథ రామానికి ఇష్టం. రాఘవను డాక్టర్ చేయాలని కలలు కంటాడు. కానీ తండ్రి కలలకు భిన్నంగా రాఘవ చదువు మధ్యలోనే ఆపేస్తాడు. చెడు వ్యసనాల బారిన పడతాడు. దొరికిన చోటల్లా అప్పులు చేస్తుంటాడు. ప్రతిసారి తప్పులు చేసి దొరికిపోతూ తండ్రితో తిట్లు తింటుంటాడు. రాఘవను ద్వేషించడం మొదలుపెడతాడు దశరథ రామం. ఓ సారి డబ్బు కోసం తండ్రి సంతకాన్ని ఫోర్జరీ చేసి దొరికిపోతాడు రాఘవ. దాంతో కొడుకును రామం పోలీసులకు అప్పగిస్తాడు. చివరకు డబ్బు, ఉద్యోగం కోసం తండ్రినే చంపేందుకు రాఘవ ప్లాన్ చేస్తాడు. స్నేహితుడైన లారీ డ్రైవర్ దేవతో (హరీష్ ఉత్తమన్) డీల్ కుదుర్చుకుంటాడు. తండ్రిని చంపాలని రాఘవ ఎందుకు అనుకున్నాడు? రాఘవలో మార్పు వచ్చిందా? తండ్రి ప్రేమను అర్థం చేసుకున్నాడా? కొడుకు కోసం రామం తీసుకున్న నిర్ణయమేమిటి? తండ్రీకొడుకుల మధ్య దూరం ఎందుకు పెరిగింది? అన్నదే రామం రాఘవం మూవీ కథ. తండ్రీకొడుకుల ఎమోషనల్ అన్నది బాక్సాఫీస్ వద్ద సక్సెస్‌ఫుల్ ఫార్ములా. ఈ ఎమోషన్‌ను ఒక్కో దర్శకుడు ఒక్కోలా ఆవిష్కరిస్తూ సక్సెస్‌లను అందుకున్నాడు. తండ్రీకొడుకుల బంధాన్ని రామం రాఘవం మూవీలో డిఫరెంట్ యాంగిల్‌లో చూపించాడు యాక్టర్ కమ్ డైరెక్టర్ ధన్‌రాజ్. ఈజీ మనీ కోసమో, వ్యసానాల బారిన పడో తల్లిదండ్రులను చంపడానికి కొడుకులు సిద్ధపడిన కథనాలు అప్పుడప్పుడు పత్రికల్లో టీవీలో కనిపిస్తుంటాయి.ఆ సంఘటనల నుంచే స్ఫూర్తి పొందుతూ రైటర్ శివ ప్రసాద్ రామం రాఘవం కథను రాసుకున్నట్లుగా అనిపించింది. ఈ పాయింట్‌ను ఎమోషనల్ రోలర్ కోస్టర్ రైడ్‌గా మనసుల్ని కదలించేలా స్క్రీన్‌పై ప్రజెంట్ చేశాడు ధన్‌రాజ్. రామం రాఘవం పాత్రలను పరిచయం చేయడానికి, కథలోని వెళ్లడానికి ధనరాజ్ ఎక్కువగా టైమ్ తీసుకోలేదు. రాఘవ తప్పులు చేస్తూ పోవడం, దశరథ రామం చేతిలో తిట్లు తినడం లాంటి సన్నివేశాలతో ప్రథమార్థాన్ని నడిపించారు. తండ్రినే చంపాలని రాఘవ నిర్ణయించుకున్నప్పటి నుంచే సినిమా ఆసక్తికరంగా మారుతుంది. రాఘవ అలాంటి నిర్ణయం ఎందుకు తీసుకున్నాడనే సస్పెన్స్, క్యూరియాసిటీ కలిగిస్తూ సెకండాఫ్ ఇంట్రెస్టింగ్‌గా సాగుతుంది.రామం రాఘవం మంచి ఎమోషనల్ ఎంటర్‌టైనర్ మూవీ. కమెడియన్‌గా తనకున్న ఇమేజ్‌ను క్యాష్ చేసుకోవాలనే ఆలోచనతో కాకుండా తాను నమ్మిన కథతో ధన్‌రాజ్ నిజాయితీగా ఈ సినిమా చేశాడు.




సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM




## పోస్టాఫీసులో రూ.520 కడితే.. రూ.10 లక్షల బెనిఫిట్

భవిష్యత్తు కోసం పొదుపు చేయడం ఎంత అవసరమో, అనుకోని సంఘటన ఎదురైనప్పుటు కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించే హెల్త్, యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ సైతం అంతే అవసరం. అనుకోనిది జరిగి ఇంటి పెద్ద మరణిస్తే ఆ కుటుంబం రోడ్డున పడాల్సి వస్తుంది. అలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రమాద బీమా అండగా నిలుస్తుంది. అయితే, చాలా మంది ఈ ఇన్సూరెన్స్ తీసుకునేందుకు ఇష్టపడరు. ప్రీమియం ఎక్కువగా ఉంటుందని వెనకడుగు వేస్తుంటారు. అలాంటి వారందరికీ పోస్టల్ శాఖ అదిరే ఆఫర్ అందిస్తోంది. చాలా తక్కువ ప్రీమియంతోనే బీమా సౌకర్యాన్ని కల్పిస్తోంది. ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీల భాగస్వామ్యంతో ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తోంది. ఏడాదికి రూ.520తో రూ.10 లక్షల బీమా పోస్టాఫీసు అందిస్తున్న యాక్సిడెంటల్ ఇన్సూరెన్సులో ఇది అద్భుతమైన స్కీమ్ అని చెప్పవచ్చు. కేవలం రోజుకు రూపాయిన్నర చెల్లించి ఏకంగా రూ.10 లక్షల కవరేజీ తీసుకోవచ్చు. టాటా ఏఐజీతో కలిసి పోస్టల్ శాఖ ఈ బీమా కల్పిస్తోంది. ఏడాదికి రూ.520 చెల్లిస్తే సరిపోతుంది. పాలసీదారుడు ప్రమాదంలో మృతి చెందినట్లయితే నామినీకి రూ.10 లక్షలు ఇస్తారు. లేదా శాశ్వత అంగ వైకల్యం, పాక్షిక వైకల్యం ఏర్పడిన సందర్భంలోనూ రూ.10 లక్షలు ఇస్తారు. ప్రమాదం జరిగి ఆసుపత్రిలో చేరిన తర్వాత వైద్య ఖర్చులకు రూ. 1లక్ష ఇస్తారు. పాలసీదారు మరణిస్తే అలాగే 21 సంవత్సరాలలోపు ఇద్దరు పిల్లల చదువు కోసం రూ. 1 లక్ష ఇస్తారు. దీంతో పాటు ఒకటి, రెండు రోజుల చికిత్స కోసం ఆసుపత్రిలో చేరితే డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ప్రకారం ఖర్చు చెల్లిస్తారు. గరిష్ఠంగా రూ.1 లక్ష వరకు వస్తాయి.




## డ్రైవర్‌కు గుండెపోటు.. వాహనాలపైకి దూసుకెళ్లిన ట్రక్కు.. ఒకరు మృతి

డ్రైవింగ్ సమయంలో ఓ ట్రక్కు డ్రైవర్ గుండెపోటుకు గురయ్యాడు. దీంతో ట్రక్కు అదుపుతప్పి వాహనాలపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఓ వ్యక్తి మరణించాడు. ఈ ఘటన కర్ణాటక జిల్లాలోని కలబురగలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ట్రక్కు యాద్గిర్ జిల్లాలోని షాపూర్ నుంచి కలబురగి వైపు వెళ్తోంది. ఈ క్రమంలో డ్రైవింగ్ సమయంలో ట్రక్కు డ్రైవర్‌కు గుండెపోటు వచ్చింది. దీంతో డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయాడు. ఈ క్రమంలో ట్రక్కు అనేక వాహనాలను ఢీ కొట్టింది. చివరికి ఓ విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టి ఆగిపోయింది. ఈ ప్రమాదంలో 32 ఏళ్ల కూరగాయల వ్యాపారి మహ్మద్ అలీ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. వెంటనే స్పందించిన స్థానికులు గాయాలపాలైన డ్రైవర్‌ను చికిత్స కోసం కలబురగి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై జైవర్గి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## చరిత్ర సృష్టించిన మహమ్మద్ షమీ

భారత పేస్ బౌలర్ మహమ్మద్ షమీ చరిత్ర సృష్టించాడు. చాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌లో బంగ్లా బ్యాటర్ జాకిర్ వికెట్ తీసి తన ఖాతాలో కొత్త రికార్డును వేసుకున్నాడు షమీ. వన్డేల్లో 200 వికెట్లు తీసిన స్పీడ్ బౌలర్ అయ్యాడు. అత్యంత వేగంగా వన్డేల్లో 200 వికెట్లు తీసిన బౌలర్‌గా షమీ నిలిచాడు. షమీ మొత్తం 5126 బంతులు వేసి తన ఖాతాలోకి 200వ వికెట్ వేసుకున్నాడు. అయితే ఆసీస్ బౌలర్ స్టార్క్ 200 వికెట్లు తీసుకోవడానికి 5240 బంతులు వేయాల్సి వచ్చింది. కానీ అతి తక్కువ మ్యాచుల్లో స్టార్క్ ఆ రికార్డును అందుకున్నాడు. టీ20 వరల్డ్‌కప్ తర్వాత గాయపడ్డ షమీ.. చాలా గ్యాప్ తర్వాత మళ్లీ జట్టులోకి వచ్చాడు.అత్యంత వేగంగా 200 వికెట్ల మైలురాయి చేరుకున్న ఇండియన్ బౌలర్‌గా షమీ నిలిచాడు. అతను 104 మ్యాచుల్లో ఆ రికార్డు క్రియేట్ చేశాడు. అంతకముందు మాజీ బౌలర్ అజిత్ అగార్కర్ 133 మ్యాచుల్లో ఆ రికార్డును అందుకున్నాడు. ఆసీస్ బౌలర్ మిచెల్ స్టార్క్ కేవలం 102 మ్యాచుల్లో 200 వికెట్ల మైలురాయి దాటాడు. దీనికి తోడు ఐసీసీ ఈవెంట్లలో ఇప్పటి వరకు షమీ తన ఖాతాలో 60 వికెట్లు వేసుకున్నాడు. వన్డే వరల్డ్‌కప్, చాంపియన్స్ ట్రోఫీల్లో అతను మొత్తం 60 వికెట్లు తీసుకున్నాడు.






## ఎన్ఎంఐఎంఎస్ వర్సిటీలో ఫుడ్ పాయిజన్..

### 80 మంది విద్యార్థులకు అస్వస్థత

ఫుడ్ పాయిజన్ కారణంగా 80 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన జడ్చర్లలోని నర్సీ మోంజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ యూనివర్సిటీలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. జడ్చర్ల మండల పరిధిలోని పోలేపల్లి వద్ద ఉన్న ఎన్ఎంఐఎంఎస్ యూనివర్సిటీలో రాత్రి విషాహారం తిని 80 మంది విద్యార్థులు వాంతులు, విరేచనాలు అస్వస్థతకు గురయ్యారు. అయితే, విషయం బయటకు పొక్కకుండా హాస్టల్ నిర్వాహకులు వైద్యులను యూనివర్సిటీకే పిలిపించి విద్యార్థులకు వైద్యం అందించే ప్రయత్నం చేశారు. అయినా, వారి ఆరోగ్యం కుదుటపడకపోవడంతో విషయం బయటకు వచ్చింది. మొదట 27 మంది విద్యార్థులకు మాత్రమే ఫుడ్ పాయిజన్ అయిందని హాస్టల్ నిర్వాహకులు స్టేట్‌మెంట్ ఇచ్చారు. తాజా సమాచారం ప్రకారం మొత్తం 80 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లుగా తెలుస్తోంది. కాగా, బయట ఫుడ్ తినడం వల్లే ఫుడ్ పాయిజన్ అయిందని నిర్వాహకులు చెబుతుండగా.. మరోవైపు హాస్టల్ ఫుడ్ తినడం వల్లే తాము అస్వస్థతకు గురైనట్లుగా విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## తాజ్ బంజారా హోటల్‌ను సీజ్ చేసిన జీహెచ్ఎంసీ అధికారులు

హైదరాబాద్‌లోని ప్రముఖ స్టార్ హోటల్‌కు జీహెచ్ఎంసీ అధికారులు ఝలక్ ఇచ్చారు. రెండేళ్ల నుంచి హోటల్ నిర్వాహకులు పన్ను బకాయిలు చెల్లించకపోవడంతో తాజ్ బంజారా హోటల్‌ను సీజ్ చేశారు. బకాయిలపైపై పలుమార్లు నోటీసులు ఇచ్చినా.. నిర్వాహకుల నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో జీహెచ్ఎంసీ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. శుక్రవారం ఉదయం హోటల్‌ను సీజ్ చేసి నోటీసులు అంటించారు. రెండేళ్లలో మొత్తం రూ.1.43 కోట్ల మేర బకాయి చెల్లించాల్సి ఉందని అధికారులు తెలిపారు. గేట్లకు తాళాలు వేసి..సీల్ చేసిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నగరంలోని ప్రముఖ హోటల్స్‌లో తాజ్ బంజారా ఒకటి. బంజారాహిల్స్‌లో ఉన్న నిత్యం బిజీగా ఉండే ఈ ఫైవ్ స్టార్ హోటల్‌కు సినీ, వ్యాపార ప్రముఖులు, విదేశీయులు ఎక్కువగా వస్తుంటారు. హైదరాబాద్‌లో క్రికెట్ మ్యాచ్ జరిగితే ఈ హోటల్‌లో ఆటగాళ్లు బస చేస్తుంటారు. బడా రాజకీయ నేతలు హైదరాబాద్‌కు వస్తే ఇందులో దిగుతారు. పార్టీ సమావేశాలకు అనుకూలంగా ఉండటంతో ఎక్కువ మంది ఈ హోటల్‌కే మొగ్గుచూపుతారు. అలాంటి ఈ హోటల్ రెండేళ్లుగా బకాయిలు చెల్లించకపోవడం



గమనార్హం. నిర్వాహకులు దీనిపై ఎలా స్పందిస్తారో? మరి. అయితే, గ్రేటర్ అధికారులు ఏకంగా ఐదుసార్లు నోటీసులు ఇచ్చినట్టు తెలుస్తోంది. అయినా వాళ్లు యాజమాన్యం స్పందించకపోవడంతో ఈ చర్యలు తీసుకున్నారు. ఈ హోటల్ నిర్వాహకులు గడిచిన రెండేళ్లుగా పన్ను చెల్లించడంలో తాత్సారం చేస్తున్నారని గ్రేటర్ ఏఎంసీ ఉప్పలయ్య అన్నారు. అంతేకాదు పాటు పలుసారు నోటీసులు జారీ చేసినా స్పందించ లేదని చివరకు రెడ్ నోటీసులు సైతం జారీ చేశామని ఆయన చెప్పారు. రెండు సంవత్సరాలుగా సదరు హోటల్ రూ.1.43 లక్షల పన్ను బకాయి ఉంచారని.. ఎంతకు స్పందించకపోవడంతో హోటల్‌ను సీజ్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

## డైరెక్టర్ శంకర్‌కు ED షాక్

తమిళ స్టార్ డైరెక్టర్ శంకర్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ భారీ షాక్ ఇచ్చింది. శంకర్‌కు చెందిన ఆస్తులను జప్తు చేస్తున్నట్లు ఈడీ ప్రకటించింది. శంకర్‌కి చెందిన రూ.10.11 కోట్ల ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జప్తు చేసింది. శంకర్ తెరకెక్కించిన 'రోబో' సినిమా కేసులో భాగంగా ఈడీ ఈ జప్తు చేసింది. శంకర్ తెరకెక్కించిన రోబో సినిమా కథను ఆయన కాపీ కొట్టారని 2011లో తమిళ రచయిత ఆరూర్ తమిళ్‌నందన్ కేసు వేశారు. ఈ కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ విచారణ చేపట్టింది. ఇందులో భాగంగా ఆరూర్ కథకు, రోబో కథకు పోలికలు ఉన్నాయని.. దీనికి సంబంధించిన ఆధారాలు ఉన్నాయని ఈడీ స్పష్టం చేసింది. రూ.11.5 కోట్ల రెమ్యూనరేషన్‌ను శంకర్ తీసుకున్నారని.. ప్రపంచవ్యాప్తంగా రోబో సినిమా రూ.290 కోట్లు వసూలు చేసినట్లు ఈడీ వెల్లడించింది.

## అటు డాక్టర్.. ఇటు హాట్ హీరోయిన్

టాలీవుడ్ ఇండస్ట్రీలో చాలా మంది డాక్టర్స్ కమ్ యాక్టర్స్ ఉన్నారు. అటు ఎంబీబీఎస్ చదువుతూ ఇటు హీరోయిన్లుగా వెండితెరపై సందడి చేస్తున్నారు. తెలుగు చిత్రపరిశ్రమలో అందం, అభినయంతో కట్టిపడేస్తున్నారు. తాజాగా ఓ హీరోయిన్ క్రేజీ ఫోటోస్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. పైన ఫోటోస్ చూస్తున్నారు కదా.. అందులో కనిపిస్తున్న హీరోయిన్ టాలీవుడ్ ఇండస్ట్రీలో చాలా ఫేమస్. ఇన్నాళ్లు హీరోయిన్ గా వరుస సినిమాలతో అలరించిన ఆ అమ్మాయి డాక్టర్ అని తెలిసి ఆశ్చర్యపోతున్నారు ఫ్యాన్స్. టాలీవుడ్ ఇండస్ట్రీలో ఇప్పుడిప్పుడే తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకుంటుంది. వరుస ఆఫర్స్ అందుకుంటూ నటిగా ప్రశంసలు సొంతం చేసుకుంటుంది. అలాగే అటు సోషల్ మీడియాలో గ్లామర్ ఫోటోస్ షేర్ చేస్తుంది. ఇతంకీ ఆ హీరోయిన్ ఎవరో తెలుసా.. ? తనే కామాక్షి భాస్కర్ల. ఇండస్ట్రీలో ఛాలెంజింగ్ రోల్స్ పోషిస్తూ సత్తా చాటుతున్న అచ్చ తెలుగమ్మాయి.

